# “శ్రీ అభినవ నన్నయ - జొన్నలగడ్డ మృత్యుంజయరావు” రచనా వైభవం (సాహిత్యం, సంస్కృతి, నైతికత)

**శ్రీ జొన్నలగడ్డ మృత్యుంజయరావు**

ఆంధ్రోపన్యాసకులు, రాజమండ్రి, తూర్పుగోదావరి జిల్లా, భారతదేశం.

**కందాళ వనదుర్గా రోహిణి**

తెలుగు అధ్యాపకురాలు, ఎ.పి. సోషల్ వెల్ఫేర్ ఐ.ఐ.టి. మెడికల్ అకాడమి, ఈడుప్పుగల్లు, విజయవాడ, కృష్ణాజిల్లా, భారతదేశం.

***Received: Aug. 2019 Accepted: Sep. 2019 Published: Oct. 2019***

**నైరూప్యము (ABSTRACT) :** సీతారామచంద్రమ్మ, బాపిరాజు పుణ్యదంపతులకు జన్మించిన “అభినవనన్నయ” “భారతాచార్య” బిరుదాంకితులు శ్రీ జొన్నలగడ్డ మృత్యుంజయరావు గారికి రాజమహేంద్రవరమే విద్యాభ్యాసము, ఉద్యోగ జీవితానికి కేంద్రంగా నిలిచింది. “వ్యాసభారతము, నన్నయ పరిష్కారము” అను సిద్ధాంతగ్రంథము, “కావ్య గౌతమి” అను నిర్వచన కావ్యము, కచ్ఛపి అను చాటుపద్య ప్రబంధము, కాళిదాసు-కుమారసంభవమునకు, పుష్పదంతుని శ్రీ శివమహిమ్న స్తోత్రానికి, శంకరభగవత్పాదుల శివానందలహరికి పద్యరూప ఆంధ్రీకరణలు, నన్నెచోడుని కుమార సంభవానికి “సంజీవని” అను పేరుతో అర్థతాత్పర్య విశేషములతో కూడిన వ్యాఖ్యానమున్నగు రచనల ద్వారా: ఆచార్య యస్వీ జోగారావు గారు, విద్వత్కవిశేఖరులు వెంపరాల సూర్యనారాయణ మూర్తి, ఆంధ్రకల్హణ బిరుదాంకితులు-మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రి, కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ వంటి మహనీయుల ప్రశంసలు పొందుట వీరి పరిశోధనా శక్తికి తార్కాణము.

ఆంధ్రదేశంలో చారిత్రాత్మక పురాతన నగరం రాజమహేంద్రవరం. అది ఆంధ్రభాషకు పుట్టినిల్లు. ఆంధ్రమహాభారతం అక్కడ ఆదికావ్యమై వెలిసింది. సంస్కృత భారత భాగాన్ని అనువాదం చేసి, నన్నయ “ఆదికవి” గా తెలుగు వాఙ్మయ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయాడు. అది మొదలు సాహిత్యంలోని వివిధ ప్రక్రియలకి, సాహిత్యానికి కళలకి రాజమహేంద్రి ఆంధ్రదేశానికి మకుటాయమానమైప్రకాశిస్తోంది.“కవిసార్వభౌమ” శ్రీపాదకృష్ణమూర్తి శాస్త్రి వంటి ఉద్దండ పండితులు ఆంధ్రప్రదేశ్ ఆస్థానకవులయ్యారు. మధునాపంతుల సత్యనారాయణ వంటి ఉద్దండ కవిపండితులురాజమహేంద్రి వన్నెను పెంచినారు.

అటువంటి వారి కోవకి చెందినవారు “అభినవ నన్నయ” బిరుదాంకితులు, కీర్తిశేషులు శ్రీ జొన్నల గడ్డ మృత్యుంజయరావు గారు. వీరు “భారతాచార్య” బిరుదుచేత కూడా అలంకృతులైరి.

**జీవిత చరిత్ర :-** జననం-1926వ సం॥మార్చి-16వ తేదీన సీతారామచంద్రమ్మ, బాపిరాజు పుణ్యదంపతులకు జన్మించిన డా. మృత్యుంజయరావు విద్యాభ్యాసము, ఉద్యోగ జీవితము అంతటకీ రాజమహేంద్రవరమే ఆవాసమయింది. 1974లో ఆంధ్రయూనివర్శిటీ నుంచి “వ్యాసభారతం - నన్నయ పరిష్కారం” అనే సిద్ధాంత గ్రంధాన్ని ఆచార్య యస్వీ జోగారావుగారి పర్యవేక్షణలో సమర్పించారు. విద్వత్కవిశేఖరులు -వెంపరాల సూర్యనారాయణమూర్తి ; ఆంధ్రకల్హణ బిరుదాంకితులు-మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రి వంటి మహనీయుల ప్రశంసలు పొందారు. వీరిపరిశోధనా గ్రంథం వారి విద్వత్తుకి నికషోపలము.

రచనలు :-

ఈ సిద్ధాంత గ్రంథంతో పాటు వీరు కాళిదాసు కుమార సంభవమునకు, పుష్పదంతుని - శ్రీశివమహిమ్న : స్తోత్రానికి : శ్రీ శంకర భగవత్పాదుల శివానందలహరికి పద్యరూపంలో ఆంధ్రీకరణ చేశారు.

నన్నెచోడుని కుమారసంభవము, శ్రీనాథుని శివరాత్రి మాహాత్మ్యం, తిక్కన-సౌప్తిక, ఉద్యోగ పర్వములు, నాచనసోమన-ఉత్తర హరివంశంలోని పంచమ,షష్ఠాశ్వాసాలు అనే వాటికి విపుల వ్యాఖ్యానాలు వ్రాశారు.

“కావ్యగౌతమి” అనే నిర్వచన కావ్యాన్ని, “కచ్ఛపి” అనే పేరుతో చాటు పద్య ప్రబంధాన్ని రచించారు. ఇవన్నీ పలువురి ప్రసిద్ధ పండితుల ప్రశంసలకు పాత్రములైనవి. అందుచేత “డా. జొన్నలగడ్డ మృత్యుంజయరావు గారి” రచనా వైశిష్ట్యాన్ని పరిశోధించి, తెలుగు సాహితీ లోకానికి వివరంగా తెలియజేయడం అత్యంతముదావహం.

**పరిశోధనా గ్రంథములు:**

“వ్యాసభారతము-నన్నయ పరిష్కారము” అనే సిద్ధాంత వ్యాసంలో వ్యాస నన్నయ భట్టారకుల భారతాల్ని రెండింటినీ పోల్చి, నన్నయ రచనా వైశిష్ట్యాన్ని, అనల్పకల్పనాశక్తిని నిరూపించి, ఆంధ్ర భారత ప్రాశస్త్యాన్ని ప్రదర్శించారు. ఇందుకై వీరు దక్షిణాత్య జౌత్తరా : ప్రతులను నునిశిత పరిశీలనము చేసి, నన్నయ అనువదించిన భారత భాగంలో పరిహరించిన అంశాలు, చేసిన మార్పులు, చేర్పులు వాటి ఔచిత్యాన్ని సువ్యక్తం చేశారు. వీరి సిద్ధాంత గ్రంథాన్ని సాక్షాత్తూ కవిసామ్రాట్విశ్వనాథ సత్యనారాయణ గారే పరీక్షించి, ప్రశంసించటం వీరి పరిశోధనా శక్తికి నిదర్శనం. అందుకే ఇది “సార్థక పరిశోధనా గ్రంథమయింది.”

కవిత్రయమున ప్రథముడైన నన్నయ భట్టారకుడు సంస్కృత భారతమును యథామూలముగా అనువదింపలేదని చెప్పి -

1. యథామూలకత
2. మూలకుంచనము
3. మూలప్రభంజనము
4.అన్యథా ప్రకల్పనము
5. మూలత్యాగము
6. అమూలకత

అనే ఆరు విధాలుగా విభజించి, నన్నయ వారిని ఏవిధంగా తన అనువాదమునకు చేర్చాడో విశదీకరించారు.

భారతాంధ్రీకరణలో నన్నయదృష్టి "రెండు విధాలుగా" ఉందని చెప్పిన సిద్ధాంతకర్త మూలంలో ఉన్న ధర్మోపదేశ సారాన్ని మాత్రమే నన్నయ గ్రహించి అనౌచిత్యాల్ని, పునరుక్తాల్ని విడిచిపెట్టి, రసపరిపోషణమునకు అవసరమైన మెలకువతో కావ్యకళాదృష్టితో కాంతా సమ్మితంగా భారత రచన చేశాడని ప్రతిపాదించారు.

"కావ్యగౌతమి'' వీరి స్వతంత్ర రచనల్లో మొదటిది. అఖండ గోదావరీ తీరాన సుమారు 80 సం॥ పైగా జీవితం గడిపిన మృత్యుంజయరావుగారు తమ కావ్యానికి - కావ్యగౌతమి అను పేరేపెట్టారు.
ఈ గౌతమిని-

1. ఆదిఘట్టము
2. కవితాఘట్టము
3. క్షేత్రఘట్టము
4. సంవాదఘట్టము

అని -4 స్నానపు రేవులుగా విభజన చేసి, గోదావరీ ఆత్మవృత్తాంతాన్ని, గోదావరికి గౌతమి అను పేరు వచ్చిన విధానాన్ని-ఆది ఘట్టంలో వర్ణించి, కవితా ఘట్టంలో - తూ: పశ్చిమ గోదావరి జిల్లాల్లో జన్మించి, రాజమహేంద్రి నగరంతో అనుబంధాన్ని ఏర్పరచుకున్న కవిపండితులతో పాటుగా ముందుగా నగరపాలకుడైన రాజరాజనరేంద్రుః కూడా రమణీయంగా వర్ణించారు.

మూడవదైన క్షేత్రఘట్టంలో రాజమహేంద్ర నగర పుణ్యక్షేత్రాలన్నింటినీ వర్ణించారు.

చివరి సంవాదఘట్టంలో తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలు సస్యశ్యామలం అవడానికి కారకుడైన కాటన్ దొరతోపాటు, మరికొందరి ప్రముఖుల్ని కూడా వర్ణించారు. ఈ కా: వీరి కవితా వైశిష్ట్యాన్ని వెలారుస్తుంది. పద్యాలన్నీ సులలితములై, ద్రాక్షారసము జాలువారును.

"ప్రత్యక్షంబగు నీశ్వరుంగని ప్రహర్షంబంది యుగ్గౌతముం
డత్యంతంబు సభక్తి చిత్తుడయి సాష్టాంగప్రణామంబులన్
గృత్యాకృత్య వివేకి చేసి యిటులర్థించెన్'' మహాదేవ! గో
హత్యాపాపము వోవభూమి విడుమా! యుత్థాపగన్ గూరిమిన్''అని-
గౌతమ మహర్షి తన గోహత్యాపాతకాన్ని నశింపజేయుమని వేడుకున్న పద్యంలో

ఒకటి, రెండు సంస్కృత సమాసములు ఉన్నప్పటికీ, వాటిలోకూడా మాధుర్యం, సౌలభ్యం, ప్రసాదగుణాలున్నాయి.
"కచ్ఛపి''ని చాటుపద్య ప్రబంధంగా కవి పేర్కొన్నారు. ఇందులో సుమారు 60సం॥

కాలం నుంచి వేరువేరు సందర్భాల్లో వేరువేరు కావ్యఖండికలను రచించి వేరువేరు వ్యక్తులను ఆశువుగా ప్రస్తుతిస్తూ రాసిన కవితల సంకలనమే కచ్ఛపి కావ్యము.

"ఆడుది నామగల్ భయము నందుదురెందుల కిట్లు? తామునా
క్కాడుది లేకయియ్యిలకు నాగమనం బొనరించి యుందురే?
ఓడకయిట్లె స్త్రీ జనము నుక్కడగించుచుబోవ నేరిబెం
ఢ్లాడుదురింక? నట్లయిన నాగి నశింపదె సృష్టి సర్వమున్''
అనే పద్యం-"అభినవ నన్నయ''-జొన్నలగడ్డ వారి కవితా వైశిష్ట్యాన్ని వ్యక్తం చేస్తుంది.

ప్రాచీన తెలుగు కావ్యాల్లో చాలా జటిలమైన నన్నెచోడుని కుమారసంభవానికి- "సంజీవని'' అనే పేరుతో జొన్నలగడ్డవారు రాసిన అర్థతాత్పర్య విశేషాంశములతో కూడిన వ్యాఖ్యానము సుమారు 1400 పేజీలతో రెండు భాగాలుగా ముద్రించారు. ఈ వ్యాఖ్యానం తెలుగు భాష తెలిసిన సామాన్యులు సైతం అతి సులభముగా అర్థం చేసుకోగలుగుతారు.

మూడవ ఆశ్వాసంలో

"తరుణులు చిల్కబొమ్మలును దంతపు బొమ్మలు'' అనే పద్యానికి మృత్యుంజయరావుగారు తాత్పర్యం వ్రాస్తూ పార్వతి చెలికత్తెలు-చిలుకల బొమ్మలను, దంతపు బొమ్మలను, మేలిగాజుపూసలు గుచ్చిన హారములను, కొయ్య బొమ్మలను నాలుగు వైపులా అందంగా అమర్చి, బొమ్మరిండ్లలో చేయు కూడులు వండుచూ, బొమ్మల పెండ్లిళ్ళు విశేషంగా చేసిందని చెప్పారు.

ఈ రకమైన తాత్పర్యం పాఠశాల విద్యార్థులకి సైతం అర్థమయ్యే రీతిలో ఉంది. ఆ విధంగా నన్నెచోడుని కావ్యాన్ని వ్యాఖ్యానం చేయడం జొన్నలగడ్డ వారికి తప్ప ఇతరులెవరికీ సాధ్యంకాదేమో!

**ముగింపు**

ఆ విధంగా నన్నెచోడుని కావ్యాన్ని వ్యాఖ్యానం చేయడం జన్నలగడ్డ వారికి తప్ప ఇతరులెవరికీ సాధ్యంకాదేమో!
ఈ విధంగా వారి రచనలన్నింటినీ విస్తృత పరిశోధన చేసినట్లయితే "అభినవ నన్నయ'' జన్నలగడ్డ మృత్యుంజయరావు గారి రచనా వైభవం సర్వవిదితమౌతుంది.

**ఉపయుక్త గ్రంథములు :**
కావ్యగౌతమి, కచ్ఛపి

***